

యాదాద్రి తరహాలో 'అడెల్లి' ఆలయం
యాదాద్రి ఆలయం తరహాలోనే అడెల్లి మహాపోచమ్మ ఆలయాన్ని కృష్ణ శిలలతో పునర్నిస్తామని రాష్ట్ర దేవాదాయ, న్యాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. 10లో▸



రాములోరి తలంబ్రాలకు స్పందన
ఆర్టీసీ లాజిస్టిక్ ద్వారా భద్రాచలం రాములవారి తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేసేందుకు చేపట్టిన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 10లో▸

గరిష్టం/కనిష్టం
37.4 /22.6

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడా చినుకులు పడే అవకాశం ఉంది.



న్యూస్‌రీల్

జాగాలు.. పట్టాలు.. పింఛన్లు..

- ప్రజావాణి అర్జీలన్నీ ఇవే
- స్వీకరించిన కలెక్టర్ వరుణ్‌రెడ్డి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి నివాస స్థలాలు, వ్యవసాయ భూములకు పట్టాలు, పింఛన్ల మంజూరుకు సంబంధించిన దరఖాస్తులే వస్తున్నాయి. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 15 దరఖాస్తులు వచ్చాయి. అన్నీ నివాస స్థలాలకు భూమి కేటాయింపు, పట్టాలు, పింఛన్లకు సంబంధించినవే ఉన్నాయి. అర్జీలను కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ రాంబాబు స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని సంబంధిత అధికారులు పంపించారు.

కిక్‌బాక్సింగ్‌లో భైంసా విద్యార్థి ప్రతిభ



రాష్ట్రస్థాయికి ఎంపికైన పృథ్వీరాజ్

భైంసాటౌన్: కిక్‌బాక్సింగ్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో భైంసాకు చెందిన విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో భైంసాలోని పిప్రి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన రెండో తరగతి విద్యార్థి పృథ్వీరాజ్ మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పృథ్వీరాజ్‌ను అభినందించారు.

ఐదు తరగతులు.. ఆరుగురు విద్యార్థులు



ఆరుగురు విద్యార్థులకు ముగ్గురు హాజరుకాగా, పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

భైంసాటౌన్/భైంసారూరల్: అనగనగా ఓ ఊరు.. ఆ ఊరిలో బడి.. బడిలో ఆరుగురు విద్యార్థులు. భైంసా మండలంలోని ఖత్‌గాం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు కేవలం ఆరుగురు విద్యార్థులే ఉన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులుండగా, ఒకరు డిప్యూటేషన్‌పై ఉన్నట్లు చెబుతున్నారు. గతంలో 20కిపైగా విద్యార్థులుండగా, కరోనా సమయంలో సంఖ్య 40 వరకు పెరిగింది. కానీ, తరువాత ఆ సంఖ్య ఆరుకి పడిపోయింది. భైంసా పట్టణం సమీపంలోనే ఉండడంతో చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించడంతో ఈ పరిస్థితి నెలకొందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. రానురాను ఈ విద్యార్థులు కూడా లేకపోతే అనగనగా ఓ బడి అని చెప్పుకోవాల్సి వస్తుంది. ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి విద్యార్థు ల సంఖ్య పెరిగేలా కృషి చేయాల్సిన అవసరముంది.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

భైంసారూరల్: నిరుద్యోగులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జీ4ఎస్ డైరెక్టర్ జోసఫ్ అన్నారు. చైతన్య సమాఖ్య భవనంలో నిరుద్యోగ యువత కోసం సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాలను సద్వినియో గం చేసుకున్న వారే జీవితంలో స్థిరపడతారన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో జీ4ఎస్ సెక్యూరిటీ సొల్యూషన్స్(హైదరాబాద్) సౌజన్యంతో సెక్యూరిటీ గార్డుల కోసం మేళా నిర్వహించామన్నారు. ఇక్కడ యువత ఉన్నత చదువులు చదివిన వారు తక్కువగా ఉన్నారన్నారు. మేళాలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారికి అవకాశం కల్పించామన్నారు. ఎంపికైనవారు క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.

నీటికుంట.. తీర్చును చింత

- ఫాం పాండ్స్ నిర్మాణాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- పొలాల వద్ద కుంట తవ్వకానికి ముందుకురాని రైతులు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



హిప్నెల్లి గ్రామంలో నీటి కుంటలో నీరు నిల్వ ఉన్న దృశ్యం

తానూరు: వాగులు, వంకల ద్వారా వృథాగా పోయే వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. నదులపై ప్రాజెక్టులు, వాగులపై చెక్‌డ్యాంలు నిర్మిస్తోంది. ఈ క్రమంలో భూగర్భ జలాలు పెంపునకు రైతులు ఫాం పాండ్స్ తవ్వుకునేలా ప్రోత్సహిస్తోంది. తద్వారా బోర్లు, బావులు రీచార్జి అవడంతోపాటు, కుంటల్లోని నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఈమేరకు ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న నీటి కుంట(ఫాంపాండ్స్)లతో రైతులకు నీటి చింత తీరుతుందని ఉపాధిహామీ అధికారులు చెబుతున్నారు. రైతులు నయా పైసా ఖర్చులు లేకుండా నీటి కుంటలను నిర్మించుకోవచ్చంటున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని గ్రామాలకు మంజూరైనా అవగాహన లేని రైతులు నీటి కుంటలు తవ్వుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. ఈ క్రమంలో ఇంకా ప్రారంభించని వాటికోసం అధికారులు ఆ సక్తి ఉన్న రైతులను గుర్తించి తవ్వుకునేలా ప్రోత్సహిస్తున్నారు. భూమి పోతుందనే ఆలోచనతో చాలా మంది రైతులు ముందుకు రావడం లేదు.

ప్రయోజనాలెన్నో..
రైతులు వర్షపు నీటిని నిల్వ చేసుకునేలా తమ పొలాల వద్ద నిర్మించుకునే చిన్న కుంటలను ఫాం పాండ్స్ అంటారు. బోరు బావులు, వర్షాధారంగా పంటలు సాగుచేసే రైతులకు ఫాం పాండ్స్‌తో ఉపయోగాలుంటాయన్నారు. నీటి కుంటలతో భూగర్భ జలాలు పెంపొందుతాయి. వీటి నిర్మాణంతో వ్యవసాయ క్షేత్రంలోని సాగు భూమిలో కొంత పోయినా భూగర్భ జలాలు మాత్రం పెరుగుతాయి. వీటి నిర్మాణంతో బోరుబావుల్లో వేసవిలోనూ నీరు పుష్కలంగా ఉంటుంది. భారీ వర్షాలకు భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. ఎగువ ప్రాంతం నుంచి నీటితోపాటు వచ్చిన మంచి మట్టి గుంతలోకి చేరుతోంది. ఈ మట్టి పొలాలకు ఎరువులా ఉపయోగపడుతోంది. ఏటా కుంటలో నుంచి మట్టిని పొలాల్లో వేసుకోవచ్చు. బోరుబావుల నుంచి కొద్దిపాటి నీరు వచ్చినా నీటి కుంటలను నింపుకుని ఒకేసారి పంటలకు నీటితడులు అందించే వీలుంటుంది. దీంతో ఎకరం పొలానికి అవసరమయ్యే నీటితో రెండెకరాలు సాగు చేయవచ్చని అధికారులు చెబుతున్నారు. నీటి కుంటలతో వర్షాభావ పరిస్థితుల్లోనూ పంటలకు ఢోకా ఉండదని పేర్కొంటున్నారు.

పైసా ఖర్చులేకుండా ...
ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడంతో రైతులకు ప్రయోజనం చేకూర్చే నీటి కుంటల నిర్మాణానికి రైతులు పైసా ఖర్చు చేయాల్సిన పనిలేదు. మొదట రైతులు వర్షపు నీటిని పొలంలో ఎక్కడ నిల్వ చేసుకోవాలో గుర్తించాలి. పొలంలో పడిన వర్షం నీరంతా ఒకే వైపు చేరడానికి అవకాశం ఉండి నీటిని నిల్వ చేసుకునేందుకు అనుకూలంగా ఉండే పల్లపు ప్రాంతంలో నీటి కుంట నిర్మించుకోవాలి. ఈమేరకు ఉపాధి హామీ అధికారులకు దరఖాస్తు చేసుకుంటే సిబ్బంది ఇచ్చే కొలతల ప్రకారం ఫాం పాండ్స్ తవ్వాలి. తవ్వకం పనులు ఉపాధి కూలీలే చేపడతారు. ఇందు కోసం రైతు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. 6 చదరపు మీటర్ల వెడల్పు, 4 మీటర్ల పొడవు, 2 లేదా 3 మీటర్ల లోతు వరకు నీటి కుంటలను నిర్మించుకోవచ్చని అధికారులు తెలిపారు.

రైతులకు అవగాహన..
రైతులు పొలాల్లో ఫాం పాండ్స్ నిర్మించుకోవాలని ఈజీఎస్ సిబ్బంది గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి వివరిస్తున్నారు. జిల్లాకు ఈ ఏడాది 1,779 ఫాం పాండ్స్ మంజూరు కాగా, ఇప్పటి వరకు కేవలం 489 పూర్తయ్యాయి. 200 ఫాం పాండ్స్ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇంకా 1,090 పూర్తి చేయాల్సి ఉంది. రైతులకు ఫాం పాండ్స్ ప్రయోజనాలపై అవగాహన లేకపోవడంతోనే నిర్మాణానికి ముందుకు రావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. వంద శాతం ఫాం పాండ్స్ నిర్మించుకునేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఉపయోగకరంగా ఉంది



గతేడాది మా వ్యవసాయ పొలంలో ఫాం పాండ్ ఏర్పాటు చేసుకున్నాం. ఎంతో ఉపయోగకరంగా ఉంది. రాత్రి వేళల్లో బోరుమోటారు నీరు కుంటలోకి వదిలి ఉదయం పంటలకు పెట్టుకుంటున్నాం. నీటికుంట మాకు ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– అసం ధర్మాన్న, రైతు ఎల్వి

అవగాహన కల్పిస్తున్నాం

రైతులు వ్యవసాయ పొలాల వద్ద ఫాం పాండ్స్ ఏర్పాటు చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఫాం పాండ్ ఏర్పాటు చేస్తే భూమి పోతుందని నిర్మించుకునేందుకు ముందుకు రావడం లేదు. ఫాం పాండ్స్‌తో లాభాలను రైతులకు వివరించి నిర్మించుకునేలా ప్రోత్సహిస్తున్నాం.

– ఓసా ప్రసాద్, ఏపీడీ

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి
- కలెక్టరేట్‌లో రంజాన్ వేడుకలపై సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

నిర్మల్‌చైన్‌గేట్: పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఈమేరకు ప్రభుత్వం పరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలపై కలెక్టరేట్‌లో సోమవారం సమీక్ష నిర్వహించారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలతో పాటు ఆయా గ్రామాల్లో మసీదులకు నిరంతరం తాగునీరు సరఫరా చేయాలని, కరెంటు కోతలు లేకుండా చూడాలని సూచించారు. మసీదుల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ ఏర్పాట్లు ప్రతీరోజు చేపట్టాలన్నారు. నిర్మల్ పట్టణంలో కొత్తగా ఈద్గా నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. రంజాన్ నాటికి పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వం రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మైనార్టీలకు కానుకలు అందిస్తుందన్నారు. రంజాన్ మాసంలో ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్, ఆర్డీవో కార్యాలయంలో హెల్ప్ లైన్లు ఏర్పాటు చేశామన్నారు. నిర్మల్ జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శాంతి భద్రతల పర్యవేక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.

అన్ని ఏర్పాట్లు చేశాం...
రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని ఎలాంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ వరుణ్ రెడ్డి అన్నారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో మైనారిటీల షాపింగ్ కోసం ప్రత్యేక సమయాలు కేటాయించామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుకార్లు నమ్మవద్దని, కొత్తవారు కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. అదనపు కలెక్టర్ రాంబాబు, మున్సిపల్ చైర్మన్లు ఈశ్వర్, రాజేందర్, జాబీర్ అహ్మద్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

దేశానికే తెలంగాణ ఆదర్శం

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



మొండిగుట్టలో మాట్లాడుతున్న మంత్రి ఐకేరెడ్డి

మామడ: అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర అటవీ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని మొండిగుట్ట గ్రామంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐకేరెడ్డి హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి పనులు ఏ రాష్ట్రంలోనూ లేవన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, రైతుబీమా, రైతుబంధు వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రైతుకు వెన్నెముకగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిలిచిందన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్య కల్పించి గ్రామాలలో సమస్యలు పరిష్కరించామన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, ఆసరా పింఛన్లు అందిస్తున్నామని వివరించారు.

రాష్ట్రంపై కేంద్రం సవతితల్లి ప్రేమ....
కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా సవతితల్లి ప్రేమను చూపుతోందని విమర్శించారు. సీఎం కేసీఆర్‌ను ఎదురించలేక ఎమ్మెల్సీ కవితను ఈడీ విచారణ పేరుతో ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్నా కేంద్రం పరిహారం అందించలేదని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతులకు రూ.10 వేల పరిహారం అందిస్తుందన్నారు. రాష్ట్రం ఏర్పాటు జరిగినప్పటికీ కేంద్రం కేంద్రీయ విద్యాలయాలు, మెడికల్ కళాశాలలు మంజూరు చేయలేదని విమర్శించారు. రాష్ట్రం స్వంత నిధులతో మెడికల్ కళాశాలలను ప్రారంభించిందన్నారు. కేంద్రం సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్యులను ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాంకిషన్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, గౌతంరెడ్డి, లింగారెడ్డి, హరీశ్‌కుమార్, గంగారెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, నవీన్‌రావు, రాందాస్, లింగారెడ్డి, భూషణ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, భాస్కర్, వసంత్‌రావు, సత్యనారాయణ, గంగారాం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



మాట్లాడుతున్న ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

లోకేశ్వరం: జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రతీ ఇంటికి ఏదో ఒకరూపంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకం అందుతోందని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో సోమవారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం కేసీఆర్ పంపించిన సందేశాన్ని పార్టీ సీనియర్ నాయకుడు రాజేశ్‌బాబు చదివి వినిపించారు. ఈసందర్భంగా ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో ప్రభుత్వ నిధులతో గుళ్లు నిర్మించామన్నారు. వ్యవసాయానికి 24 గంటలు ఉచిత కరెంటు ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. మండలంలోని పంచగుడి, మన్మద్, గడ్‌చాంద, పిప్రి, కన్కపూర్ గ్రామాల్లో ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందిస్తున్నామన్నారు. సొంత ఇంటి స్థలం ఉన్న నిరుపేదలు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షలు అందిస్తామని తెలిపారు. వచ్చే నెలలో సీఎం కేసీఆర్ జిల్లాకు వస్తున్నారని, ఆ సభలో మండలంలోని సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజలు మరోసారి పట్టం కట్టి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ శ్యాసుందర్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్లు లక్ష్మణ్‌రావు, చిన్నారావు,సర్పంచులు నరేష్, ఎల్లన్న, నాయకులు బాయమోల్ల భోజన్న, ప్రశాంత్, గంగాధర్, దిగంబర్, శ్రీధర్, రాజేశ్‌బాబు, ఉత్తం భోజారెడ్డి, సాయారెడ్డి, రాజారెడ్డి, రమేశ్ రెడ్డి, సాహెందర్, అనిల్, ఆంజనేయులు, సుధాకర్, సుదర్శన్‌రెడ్డి, నాలం గంగాధర్, రాజేశ్వర్, రాజు, ఉత్తం, అనిల్, ప్రకాశ్, అసిబొద్దీన్, మగ్గిడి భోజారెడ్డి పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే కేసులు పెడతారా?

- డీసీసీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి
- మహేశ్వర్‌రెడ్డిపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ ఆందోళన



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్/దిలావర్‌పూర్: ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రశ్నించే హక్కు ప్రజలకు, ప్రజల తరపున ప్రతిపక్షాలకు ఉంటుందని, దానిని కాలరాయాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని డీసీసీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి ఆరోపించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అవినీతి, అక్రమాలను వెలికితీసి నిజాలను ప్రజలకు తెలియజేస్తున్న ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేతలు పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అక్రమ కేసులను నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని వివేకానంద విగ్రహం వద్ద, దిలావర్‌పూర్‌లో నిర్మల్–భైంసా రహదారిపై కాంగ్రెస్ శ్రేణులు సోమవారం ఆందోళన చేశాయి. అనంతరం బీఆర్ఎస్ దిష్టిబొమ్మ, రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ముత్యంరెడ్డి మాట్లాడుతూ మహేశ్వర్‌రెడ్డి అంటే మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి భయపడుతున్నారని అన్నారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా భయపడేది లేదన్నారు. ఎంత మందిపై కేసులు పెడతారో పెట్టుకోండి అని హెచ్చరించారు. లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలను చులకనగా చేసి, పరీక్ష పేపర్ లీకులు కామన్ అని మాట్లాడిన చరిత్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిదని, నిరుద్యోగులకు న్యాయం జరగాలని దీక్షలు చేసిన చరిత్ర ఏలేటిదని గుర్తుచేశారు. నిర్మల్ మున్సిపల్ ఉద్యోగాల నియామకాల్లో అక్రమాలను జరిగడం, అవి నిరూపణ కావడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ విషయంలో మంత్రి స్వయంగా అక్రమాలు జరిగాయని మీడియా ముందు వచ్చి వివరాలు వెల్ల డించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో మంత్రి రాజకీయంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నాని ఆరోపించారు. మున్సి పల్ ఉద్యోగాల నియామకంలో తప్పులు జరగకపో తే నియామకాలు ఎందుకు రద్దు చేశారని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నాందేడపు చిన్ను ప్రశ్నించారు, బాధితుల తరపున మహేశ్వర్‌రెడ్డి చేసిన దీక్షతో మంత్రి ప్రెస్‌మీట్‌లో నియామకాలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పోలీసులు డీసీసీ అధ్యక్షుడు డి.ముత్యంరెడ్డి, జెడ్పీటీసీ తక్కల రమణారెడ్డితోపాటు పలువురు కాంగ్రెస్ నేతలను అరెస్టు చేసి దిలావర్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిరసనలో యూసుఫ్, సాయారెడ్డి, రాజలింగం, ఉద్గిరి సాయినాథ్, దిలావర్‌పూర్ సర్పంచ్ జంగం వీరేశ్, రవి, సత్యనారాయణ్‌గౌడ్, ఉదయ్ గౌడ్, నిరంజన్‌రెడ్డి, రమణ, నడ్పి ముత్యం, సంభు భోజా రాం పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులపై కేసు..
నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో అనుమతి లేకుండా నిరసన తెలిపిన నిర్మల్ కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై గంగాధర్ తెలిపారు. ఏఐసీసీ అమలు కమిటీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డిపై కేసు నమోదు అయినందున స్థానిక వివేకానంద చౌరస్తా వద్ద అనుమతి లేకుండా కాంగ్రెస్ నాయకులు సోమవారం నిరసన తెలిపారు. బీఆర్ఎస్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించారని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, నాయకులు జింక సూరి, కలీం, షేక్ జలాల్, చరణ్ సంతోష్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి



పాలిటెక్నిక్ కళాశాలలో వైద్య విద్యార్థుల కోసం వసతులు పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని కడ్తాల్ ఎంట్రన్స్‌లో స్ట్రీట్ లైట్స్, శ్యామ్‌ఘడ్, ఎన్టీఆర్ స్టేడియం, పాలిటెక్నిక్ కాలేజీ, బంగల్‌పేట్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోఫీనగర్ నుంచి కడ్తాల్ వరకు హైవేపై ఏర్పాటు చేసిన స్ట్రీట్‌లైట్లు, శ్యామ్ ఘడ్ పరిసర ప్రాంతాలలో, ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్ లైట్స్ ఏర్పాటుకు డీపీఆర్ తయారుచేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మెడికల్ కళాశాల విద్యార్థుల కోసం పాలిటెక్నిక్ కళాశాలలో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు.

'నార్మల్'పై అవగాహన కల్పించాలి..
బంగాల్‌పేట్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి అవుట్ పేషెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. నార్మల్ డెలివరీలపై గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, తహసీల్దార్ సుభాష్ అధికారులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు



మామడ పీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న ట్రైనీ శ్రీనివాస్

మామడ: సడెన్ కార్డియాక్ అరెస్ట్(ఎస్‌సీఏ) జరిగినపుడు గుండె అకస్మాత్తుగా కొట్టుకోవడం ఆగినపుడు మెదడు ఇతర అవయవాలకు రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడుతుందని వెంటనే సీపీఆర్(కార్డియో పల్మనరీ రిసాసిటేషన్) నిర్వహించాలని వైద్యుడు అరుణ్‌కుమార్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలకు సీపీఆర్‌పై సోమవారం అవగాహన కల్పించారు. శిక్షకుడు శ్రీనివాస్ సీపీఆర్ నిర్వహించే విధానం గురించి వివరించారు. ఛాతీని నొక్కడం, రెస్క్యూ శ్వాస అందించడం ద్వారా శరీరమంతా ఆక్సిజన్‌తో కూడిన రక్తం అందించబడుతుందని తెలిపారు. దీంతో కార్డిక్ అరెస్ట్ అయినవారు బతికే అవకాశం ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కన్నయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రైట్ టు హెల్త్ బిల్లు ఉపసంహరించుకోవాలి

- ఐఎంఏ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న వైద్యులు

నిర్మల్‌చైన్‌గేట్: రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైట్ టు హెల్త్ మెడికల్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని ఐఎంఏ నిర్మల్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఉదిగిరి రామకృష్ణ , స్టేట్ వర్కింగ్ కమిటీ నాయకులు డాక్టర్ అప్పాల చక్రధారి అన్నారు. దేశవ్యాప్త ధర్నాలో భాగంగా నిర్మల్ ఐఎంఏ ఆధ్వర్యంలో రాజస్థాన్ ప్రభుత్వం తీసుకొచ్చిన తలాతోక లేని వైద్య బిల్లును ఉపసంహరించుకోవాలని జిల్లా కేంద్రంలోని ఐఎంఏ కార్యాలయం ఎదుట సోమవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రైవేటు వైద్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తే ప్రజారోగ్యానికి విఘాతం కలుగుతుందన్నారు. ప్రజలకు ఆరోగ్యం కల్పించడం అనేది రాష్ట్ర ప్రభుత్వాల ధర్మమని ఇది రాజస్థాన్ ప్రభుత్వం చూసుకోకుండా ప్రభుత్వ వ్యవస్థను నిర్వీర్యంచేస్తూ ప్రైవేట్ డాక్టర్ల వ్యవస్థను కూడా నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు అనిపిస్తుందన్నారు. ఎమర్జెన్సీ అనే పదానికి నిర్వచనం కూడా చెప్పకుండా ఈ బిల్లులో ఎమర్జెన్సీ సేవలు అన్నింటికీ ఏ రకమైన చార్జీలు లేకుండా 24 గంటలు డాక్టర్లు చూడాలని చెప్పడంతో వైద్యులు, రోగుల మధ్య సంబంధాలు దెబ్బతింటాయన్నారు. నిజంగా ప్రజారోగ్యంపై పాలకులకు ప్రేమ ఉంటే మొత్తం ప్రైవేట్ వైద్య వ్యవస్థను జాతీయం చేసి దేశ ప్రజలందరికీ సామాజిక వైద్యాన్ని ఉచితంగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ దామెరరాములు, ప్రధాన కార్యదర్శి పొలిశెట్టి సంతోష్, ప్రచారసమితి నాయకులు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు, వైద్యులు శ్రీనివాస్, బీఎల్ఎన్.రెడ్డి, కావేటి శ్రీకాంత్, రనిత్, సుచిన్, మల్లయ్య, రాఘవ స్వామి పాల్గొన్నారు.

పాలీహౌస్‌కు ప్రోత్సాహం ఏది?

- ఐదేళ్లుగా దరఖాస్తుల స్వీకరణ లేదు
- రైతులకు సబ్సిడీ ఇవ్వకుండా చేతులెత్తేసిన ప్రభుత్వం
- లాభాలు ఉన్నా ఫలితం సున్నా



ఇచ్చోడ మండలంలోని అడేగామ(కె)లో పాలీహౌస్

ఇచ్చోడ: జిల్లాలో ఉద్యానవన పంటలకు అనుకూలమైన నేలలు ఉన్నప్పటికీ పాలీహౌస్ రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం కరువైంది. పాలీహౌస్‌పై సబ్సిడీ ఇవ్వకుండా చేతులెత్తేసింది. ఉద్యానవన పంటల సాగు వైపు రైతులు మొగ్గుచూపడం లేదు. రాష్ట్రం ఏర్పాటు తర్వాత జిల్లాలో ఉద్యాన హబ్‌గా మారుస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో జిల్లాలో ఎంతో మంది రైతులు ఆశ పడ్డారు. కాని ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో 2018 నుంచి పాలీహౌస్‌లపై ప్రభుత్వం సబ్సిడీని నిలిపివేసింది. ఐదేళ్ల నుంచి పాలీహౌస్‌ల కోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం లేదు.

గతంలో భారీ సబ్సిడీ

ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం గత ఐదేళ్ల క్రితం భారీగా సబ్సిడీ ఇచ్చింది. ఎకరా పాలీహౌస్‌కు ఎస్సీ, ఎస్టీ రైతులకు 95 శాతం, ఇతర రైతులకు 75 శాతం సబ్సిడీపై పాలీహౌస్‌లకు కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. దీంతో జిల్లాలో రైతులు పాలీహౌస్‌ల ద్వారా కూరగాయలు, అకుకూరలు, దోస తదితర పంటలు పండించి అధిక లాభాలు పొందారు.



పాలీహౌస్‌లో సాగువుతున్న దోస

లాభాలు ఉన్న ఫలితం సున్నా

ప్రతిఏటా అతివృష్టి, అనావృష్టితో పంటల పండక ఆర్థికంగా నష్టపోవడంతో రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందే సాంకేతిక వ్యవసాయం చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. దీనిలో భాగంగా అనేక మంది పాలీహౌస్‌లు ఏర్పాటు చేయాలని అనుకున్నా జిల్లాలో గత ఐదేళ్ల నుంచి పాలీహౌస్ యూనిట్లు మంజూరు కాలేదు. ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల ఆశలు ఆవిరి అవుతున్నాయి.

జిల్లాలో 30 ఎకరాల్లో సాగు

జిల్లాలో దాదాపుగా రెండున్నర లక్షల ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు ఉన్నాయి. ఈ లెక్కన జిల్లాలో కనీసం 20 వేల ఎకరాల వరకు ఉద్యానవన పంటలు సాగు కావాలి. కాని ప్రసుతం జిల్లాలో కేవలం 30 ఎకరాల్లో మాత్రమే పాలీహౌస్ కింద వివిధ పంటలు సాగవుతున్నాయి.

ఏడాదిలో రూ 3 లక్షల లాభం



పాలీహౌస్‌తో కూరగాయలు, వేసవిలో దోస సాగు చేశారు. ఏడాదిలో పంటల సాగుకు ఖర్చులు పోను రూ.3 లక్షల లాభం వచ్చింది. వర్షాకాలంలో కూరగాయల సాగుకు పాలీహౌస్ చాలా అనుకూలంగా ఉంటుంది.

– కుమ్ర కేశవ్‌రావు, పాలీహౌస్ రైతు, మార్కగూడ, ఇంద్రవెల్లి మండలం

రూ.లక్ష లాభం వచ్చింది



అర ఎకరంలో బ్రొకోలిని పాలీహౌస్ కింద సాగు చేశాను. మంచి దిగుబడి వచ్చింది. పంటపై పెట్టిన ఖర్చులు పోను దాదాపు రూ.లక్ష లాభం వచ్చింది. ప్రసుతం మరో ఎకరంలో దోస సాగు చేస్తున్నాను.

– గణేష్, రాథోడ్, పాలీ హౌస్ రైతు దాబా(కె) ఇచ్చోడ మండలం.

దరఖాస్తుల స్వీకరణ నిలిపివేత



ప్రభుత్వం 2018 నుంచి పాలీహౌస్ కోసం దరఖాస్తులు స్వీకరణ నిలిపివేసింది. పాలీహౌస్ సాగుకు జిల్లా నేలలు అనుకూలం. పాలీ హౌస్‌ల ద్వారా సాగు చేయడానికి రైతులు ఆసక్తితో ఉన్నారు. ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వకపోవడంతో రైతులు సాగుకు ముందుకు రావడంలేదు.

– మహేశ్, ఉద్యానవన శాఖ అధికారి

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన



నిరసన తెలుపుతున్న వైద్యులు

ఆదిలాబాద్‌టౌన్: రాజస్థాన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైట్ టు హెల్త్ పథకాన్ని నిరసిస్తూ జిల్లాకేంద్రంలో వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం రిమ్స్ డైరెక్టర్ చాంబర్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఐఎంఏ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టగా రిమ్స్‌లో పనిచేస్తున్న వైద్యులతో పాటు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు హాజరయ్యారు. అనంతరం ఐఎంఏ బాధ్యులు మాట్లాడుతూ రాజస్థాన్‌లో ప్రవేశపెట్టిన రైట్ టు హెల్త్ ద్వారా వైద్యులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. ఈ పథకంలో రోగి ఏ సమయంలో వచ్చినా వైద్య సేవలందించాలని, వ్యాధికి సంబంధం లేని వైద్యుడు సైతం ట్రీట్మెంట్ చేసేలా జీవో తీసుకొచ్చారని తెలిపారు. ప్రైవేట్ వైద్యులు రోగుల నుంచి ఎలాంటి డబ్బులు తీసుకోకుండా ఉచిత వైద్యం అందించేలా జీవోలో పొందుపర్చడం సరికాదన్నారు. వైద్యులు సుమలత, శ్యాంప్రసాద్, ఇద్రిస్ అక్బాని, కల్యాణ్‌రెడ్డి, శ్యామల, అరుణ, సత్యనారాయణ, తిరుమల్‌రెడ్డి, సందీప్ పవార్, సూరజ్, ప్రకాశ్, స్వామి పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌నకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థినుల ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ

భైంసా: ప్రొక్టర్, క్యాంపుల్ ఇండియా ఆధ్వర్యంలో అందిస్తున్న శిక్షా భేటియా స్కాలర్‌షిప్‌నకు బాసర ఆర్జీయూకేటీ విద్యార్థినులు పలువురు ఎంపికయ్యారు. ఈ మేరకు వారిని ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ సోమవారం అభినందించారు. రాష్ట్రంలోని ప్రముఖ సాంకేతిక విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థినులను స్కాలర్‌షిప్‌నకు ఎంపికచేసి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. వర్సిటీకి చెందిన 32 మంది విద్యార్థినులు స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. స్కాలర్‌షిప్ సెక్షన్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డాక్టర్ విఠల్, సిబ్బంది చిన్నారెడ్డి, శ్వేత, హిమబిందు, సమీనా బేగం, నవకాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగుల సంక్షేమానికి కృషి



ఇన్‌చార్జి వీసీని సన్మానిస్తున్న బోధనేతర సిబ్బంది

భైంసా: ఆర్జీయూకేటీ బోధనేతర ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని వర్సిటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ అన్నారు. ఈ మేరకు సోమవారం వర్సిటీ బోధనేతర సిబ్బంది ఆయన్ను కలిశారు. 30 శాతం పీఆర్సీని అమలు చేయడంతోపాటు రెండోవిడత బకాయిలు చెల్లించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్యాంబాబు, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అరుణజ్యోతి, ప్రధాన కార్యదర్శి షేక్ దస్తగిరి, సభ్యులు రవివర్మ, హరికృష్ణ, మోహన్‌బాబు, బద్రి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం



దగ్ధమవుతున్న ఇల్లు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని నవయువ కాలనీలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధమైంది. కాలనీవాసుల తెలిపిన వివరాలు.. నర్సమ్మ (80) అనే వృద్ధురాలు గత కొంతకాలం నుంచి కాలనీలో ఓ ఇంట్లో నివాసం ఉంటుంది. ఉదయం బహిర్భూమికి వెళ్లింది. షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులకు నిప్పంటుకుని కాలిపోయింది. చుట్టుపక్కల వారు గమనించి అగ్నిప్రమాద కేంద్రానికి సమాచారం అందించారు. సమయానికి వాహనం రాకపోవడంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైందని కాలనీవాసులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ ప్రీతంరెడ్డి వృద్ధురాలిని పరామర్శించి రూ.10 వేల నగదు అందజేశారు. సామాజిక కార్యకర్త నిమ్మల సంతోష్‌రెడ్డి వృద్ధురాలికి నూతన వస్త్రాలు అందజేసి ఉదారతను చాటుకున్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని కురన్నపేట్ చెరువులో ఈత కొడుతూ గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైనట్లు పట్టణ సీఐ మల్లేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈనెల 25న స్థానిక ధ్యాగావాడకు చెందిన పూసం పవన్ (28) మద్యం తాగి కురన్నపేట్ చెరువులో ఈత కొడుతూ ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. ఈ మేరకు పోలీసులు, పట్టణ ఎస్సై జ్యోతిమణి ఆధ్వర్యంలో గత రెండు రోజుల నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి మృతదేహం లభ్యమైనట్లు సీఐ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఊరెళ్తే.. దోచుకెళ్లారు

ఆదిలాబాద్‌టౌన్: కూలీనాలీ చేసుకుని కూడబెట్టుకున్న డబ్బులను దొంగలు ఎత్తుకెళ్లిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పరిధిలోని మహాలక్ష్మీవాడకు చెందిన ఎడిపెల్లి స్వామి నివాసముంటున్నాడు. రజకవృత్తి చేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 25న సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో స్వామి తన కుటుంబీకులతో భీంపూర్ మండలం పిప్పల్‌కోఠి గ్రామంలోని తన బంధువుల ఇంటికి వెళ్లాడు. తాళం వేసి ఉండటాన్ని గమనించిన దుండగులు ఇంట్లోకి చొరబడి రూ.10వేల నగదు, 5 గ్రాముల బంగారం, 2 గ్రాముల వెండిని ఎత్తుకెళ్లారు. మరుసటి రోజు 26న తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన చుట్టుపక్కల వారు ఫోన్ ద్వారా బాధితుడికి సమాచారమందించారు. వారు హుటాహుటిన ఇంటికి చేరుకున్నారు. కష్టపడి కూడబెట్టుకున్న సొమ్ము దొంగల పాలు కావడంతో కన్నీరుమున్నీరయ్యారు. దీనిపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

200 క్వింటాళ్ల సోయా, లారీతో ఉడాయింపు

- బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు

జైనథ్: మండలంలోని మేడిగూడలో ఈనెల 24న కొనుగోలు చేసిన 200 క్వింటాళ్ల సోయాలు, లారీతో దుండగులు ఉడాయించారు. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం.. ఆదిలాబాద్‌లోని మహాలక్ష్మివాడకు చెందిన చంద్రకాంత్ ఈనెల 24న మేడిగూడలో 200 క్వింటాళ్ల సోయలు కొనుగోలు చేశాడు. అనంతరం కేఆర్కే కాలనీకు చెందిన చౌహాన్ రవి అనే డ్రైవర్‌ను నియమించుకుని లారీలో సోయాలోడ్ నింపుకొన్నాడు. ఈనెల 24 సాయంత్రం డ్రైవర్ రవి, క్లీనర్ ఆత్మారాంతో కలిసి మేడిగూడ నుంచి మహారాష్ట్రకు బయల్దేరాడు. అయితే మహారాష్ట్రకు వెళ్లిన తర్వాత నుంచి డ్రైవర్ ఫోన్ స్విచాఫ్ రావడంతోపాటు లారీ ఆచూకీ తెలియలేదు. రెండు రోజుల పాటు గాలించి నప్పటికి ఫలితం లేకపోయింది. సోమవారం బాధితుడు చంద్రకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాథోడ్ ఆత్మారాం తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఉట్నూర్: గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు, డీడీ దిలీప్‌కుమార్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల ప్రజలు అర్జీలు అందజేశారు. రైతుబంధు, డబుల్ బెడ్రూం, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ దరఖాస్తులు సమర్పించారు. శాఖల అధికారులు అర్జీలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొమురం బాలు, ఓఎస్డీ కిష్టయ్య, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



అల్లె రాజన్న మృతదేహం

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లె రాజన్న (48) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామానికి చెందిన అల్లె రాజన్న ఆదివారం రాత్రి ఖానాపూర్ వైపు నుంచి స్వగ్రామానికి ఆటోలో వెళ్తున్నాడు. ధర్మాజీపేట్ గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద ఆటో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజన్నకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొసన రాజు తెలిపారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ స్థాయి ఐఎన్‌టీఎస్ఓ ఒలింపియాడ్ లెవల్–2 పరీక్షల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పట్టణంలోని చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ బహుమతి, 4, 5వ బహుమతులతో పాటు 31 మంది గోల్డ్‌మెడల్, 20 మంది మెరిట్ సర్టిఫికెట్‌ను పొందినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో నజీమ్, జెస్సిక, అజయ్, శ్రీవిద్య, శ్రీధర్, లక్ష్మణ్‌రావు, రాజు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య



ఉమాకాంత్(ఫైల్)

ఇంద్రవెల్లి: మద్యానికి బానిసై ఒకరు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు, ఎస్సై డి.సునీల్ తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని మిలింద్‌నగర్ గ్రామానికి చెందిన ముండే ఉమాకాంత్(39) డ్రైవర్‌గా, కూలీ పని చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రస్తుతం ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి తాగిన మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య భాగ్యశ్రీ, కుమారుడు, కూతురు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలు

నిర్మల్‌టౌన్: హత్యాయత్నం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలుశిక్షతోపాటు, ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమానా విధిస్తూ నిర్మల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి అజేష్‌కుమార్ సోమవారం తీర్పు నిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపిన వివరాలు.. ఖానాపూర్ మండలం తర్లపాడ్‌కు చెందిన కోవ మారుతి(35), గ్రామస్తులందరూ కలిసి 2019, మే 20న వన భోజనాల కోసం ఊరు బయటకు వెళ్లారు. భోజనాలు చేసి ఇంటికి వస్తున్న సమయంలో కొందరు మద్యం తాగి గొడవ పడుతున్నారు. కులపెద్దగా ఉన్న కోవ మారుతి వారిని నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అక్కడే ఉన్న అదే గ్రామానికి చెందిన పూసం మాధవరావు(35), పూసం అన్ను (45) ఇద్దరు అన్నదమ్ములు పాత కక్షలను మనసులో పెట్టుకొని మారుతిని గొడ్డలితో దాడికి యత్నించారు. ఈ దాడిలో ఆయన ముక్కుకు తీవ్రగాయం కావడంతో బాధితుడిని గ్రామస్తులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుడి భార్య కోవ లక్ష్మి ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై జి.ప్రసాద్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. చార్జ్‌షీట్ దాఖలు చేసి కోర్టులో నిందితులను హాజరుపర్చగా పీపీ వై.రమణారావు 9 మంది సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో జడ్జి తీర్పు వెలువరించారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన కార్మికులు

కైలాస్‌నగర్: తమ వేతన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్‌తో మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు విధులకు హాజరయ్యేందుకు వచ్చి.. విధులకు వెళ్లకుండా కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఉదయం 10:30 గంటల వరకు ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకుని వారి వద్దకు వచ్చిన మున్సిపల్ కమిషనర్ ఏ.శైలజకు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ విన్నవించారు. ఆమె సానుకూలంగా స్పందించడంతో వారు ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న తమ సమస్యలను సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 8 నెలలుగా పీఎఫ్ బకాయిలను కోత విధిస్తున్నప్పటికి వాటిని తమ ఖాతాల్లో జమ చేయడం లేదన్నారు. నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వేతన, పీఎఫ్ బకాయిలను అధికారులు వెంటనే చెల్లించాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కాగా, వీరి ఆందోళనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, రాష్ట్రర కమిటీ సభ్యురాలు సుహాసినిరెడ్డి మద్దతు తెలిపారు.

సమస్యలను చెప్పుకునేందుకే వెళ్లాం

పీఆర్సీ, పీఎఫ్, వారాంతపు సెలవులు వంటి అంశాలపై మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు వెళ్తే వివిధ పార్టీలు, సంఘాల నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పేర్కొన్నారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన మీడియా సమావేశంలో కార్మికులు నగేశ్, శంకర్, రాకేశ్, లక్ష్మి, ఉషన్న, సురేశ్ మాట్లాడారు. కార్మికులందరం కలిసి మున్సిపల్ కమిషనర్‌తో పలు అంశాలపై చర్చించేందుకు వెళ్లామన్నారు. తమకు రావాల్సిన పీఆర్సీ. పీఎఫ్, వారాంతపు సెలవులు, ఏరియర్స్ తదితర అంశాలపై మున్సిపల్ చైర్మన్‌తో పాటు కమిషనర్ స్పష్టమైన హామీలు ఇవ్వడంతో తిరిగి విధుల్లోకి వెళ్లినట్లు పేర్కొన్నారు. తాము ఎలాంటి సమ్మెలు, ధర్నాలు చేయలేదన్నారు. తెలంగాణ వచ్చాక ప్రభుత్వం రెండుసార్లు మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచిందని, ప్రస్తుతం రూ. 15,600 వేతనం అందుతుందని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురికి జైలు

కడెం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలో పట్టుబడిన ఆరుగురికి ఖానాపూర్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ జితిన్‌కుమార్ ఒకరోజు జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని ఎస్సై రాజు తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన ఆర్క వెంకటేశ్, నేర్పపల్లి గణేశ్, నైతం సురేశ్, నీరటి శమిందర్, భుక్యా రాజేందర్, శ్రీరాముల రవిని సోమవారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా, ఒకరోజు జైలు శిక్ష విధించారని పేర్కొన్నారు. ఈ మేరకు వారిని నిర్మల్ జైలుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

నస్పూర్: ఏరియాలోని వివిధ డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్, ఆటోగ్యారేజీ, ఏరియా స్టోర్, టింబర్ యార్డ్, ఆర్కే 8 డిస్పెన్సరీలో బాయి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులకు రెస్ట్‌హాల్స్ మినరల్ వాటర్ సౌకర్యం, రేడియం జాకెట్స్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. శ్యాం, స్వామి, నాయకులు పెట్టం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



పిల్లపాపలతో ప్రజావాణికి వచ్చిన అడెల్లి తండావాసులు

గూడు కోసం గోస



సారంగపూర్ మండలం అడెల్లితండాలో గత 20 ఏళ్లుగా కనీస వసతులు, గూడు లేక తండావాసులు గోస పడుతున్నారు. తమ బాధ చెప్పుకునేందుకు నిర్మల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వచ్చారు. పిల్లపాపలతో వచ్చి తమకు కనీస వసతులు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్